టీబీ నిర్మూలనే ధ్యేయం

ముత్తారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీబీ నిర్మూలనే ధ్యేయమని ముత్తారం మండల వైద్యాధికారి అమరేందర్ రావు అన్నారు. ముత్తారం గ్రామపంచాయతీ ఆవరణలో 60 ఏళ్ల పైబడ్డవారికి, దుమ్ము, ధూళి సోకే ప్రదేశాల్లో పని చేస్తున్న వారికి, స్మోకింగ్, టీబీ కాంటాక్ట్ వారికి, రెండు వారాలకు మించి దగ్గు ఉన్న 172 మందికి ఎక్స్‌రేలు తీశారు. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిని ముందుగా గుర్తిస్తే నిర్మూలించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది మిట్ట శ్రీను, ఆశా వర్కర్లు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాఠశాలల పర్యవేక్షణ, బ్యాంక్ ఖాతాల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. జిల్లాలోని పలు శాఖల్లో వినియోగించని బ్యాంకు ఖాతాలలో జమ చేసి ఉన్న డబ్బు ఆర్‌బీఐ నుంచి వెనక్కి తీసుకునేందుకు కేవైసీ వివరాలు, రిక్వెస్ట్ లెటర్ అందించాలని ఆయన తెలిపారు. ఈ నెల 22 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. డిసెంబర్ చివరి నాటికి జిల్లాలోని విద్యాసంస్థల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేసే దిశగా రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అధికారులు రెండు ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి పనులపై నివేదిక అందించాలన్నారు. రాబోయే ఐదేళ్లలో పాఠశాలల్లో అవసరమైన మేర అభివృద్ధి పనులు జరిగేలా చూడాలని, ఇంకా ఏమైనా పనులు చేపట్టాల్సి ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు అందిస్తామన్నారు.

రాజీమార్గంతో కేసులు పరిష్కారం



సుల్తానాబాద్ లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి, న్యాయవాదులు

సుల్తానాబాద్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో శనివారం జడ్జి గణేష్ స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇందులో పలు క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, భూమి, ప్రమాదాలు, చెక్‌బౌన్స్ కేసులకు సంబంధించిన 54 కేసులు పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, ఏపీపీ శ్యాం ప్రసాద్‌రావు, ఏజీపీ దూడం ఆంజనేయులు, లోక్‌అదాలత్ సభ్యులు మాదారి అంజనేయులు, చీకటి సంతోష్ కుమార్, న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోల్‌సిటీ,(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం సాధ్యపడుతుందని అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. లోక్ అదాలత్ పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. పలు కేసుల్లో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు. ఏజీపీ శంతన్ కుమార్, ఏసీపీ మడత రమేష్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, ప్రవీణ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తాం



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని మధ్యాహ్న భోజన నిర్వాహకులు అన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మధ్యాహ్న భోజన కార్మికుల తలరాత మారడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మధ్యాహ్న భోజన వర్కర్లకు సరైన న్యాయం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశ పడినా నెరవేరడం లేదన్నారు. నిత్యావసర సరుకులు ఇవ్వాలని, వర్కర్లను కార్మికులుగా గుర్తించి నెలకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొన సాగిస్తామని తెలిపారు. మేకల యశోద, రాధమ్మ, లావణ్య, కళావతి, జుబేదా, వర్కర్లు పాల్గొన్నారు.

మత్తు కేఫ్‌లు..

- స్మోకింగ్ జోన్‌లతో మైనర్లకు గాలం...
- విద్యా సంస్థలు, హైవేల పక్కన నిర్వహణ...
- గంటకు రూ.20 నుంచి రూ.50 వసూళ్లు...
- పోలీస్ నిఘా లేకపోవడంతో విచ్చలవిడిగా దందా...
- మేజర్ గ్రామాల నుంచి నగరాల దాకా వ్యాపారం
- ఒక్క రామగుండంలోనే 40 నుంచి 50 సెంటర్లు



స్మోకింగ్ జోన్‌లో యువకులు

కోల్‌సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చాయ్ దుకాణాలు, కేఫ్‌ల మాటున జిల్లాలో పెద్ద ఎత్తున మత్తు కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది... గ్రామాల నుంచి నగరాల దాకా ఇప్పుడు చాయ్ హోటళ్లలో కొత్తగా స్మోకింగ్ జోన్‌లు వెలిశాయి. ఈ స్మోకింగ్ జోన్‌ల పేర కొత్త దందాకు తెర తీశారు... మైనర్లే టార్గెట్‌గా రహదారులు, విద్యాసంస్థల సమీపాల్లో ఏర్పాటు చేసి వారిని ఆకర్షిస్తున్నారు. మొదట సిగరెట్లు తాగేందుకు వెళుతున్న మైనర్లు తరువాత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. గంజాయి వ్యాపారులు వీటికి అలవాటు పడిన మైనర్లతోనే మరికొందరు పిల్లలను ఆకర్షించి దందా విస్తరించు కుంటున్నారు. అమ్మకాలు సాగించేది, సేవించేది మైనర్లే అనే రీతిలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. స్మోకింగ్ జోన్‌లో సౌకర్యాలను బట్టి గంటకు రూ.20 నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు.

జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీలు మొదలు నగరాల వరకు ఏడాది కాలంలో కొత్తగా వివిధ పేర్లతో చాయ్ అమ్మకాల పేర కేఫ్‌లు వెలిశాయి. ఈ కేఫ్‌లు ఎక్కువగా ప్రధాన రహదారులు ఉన్న ప్రాంతాలు, విద్యా సంస్థలు ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ముందట టీ అమ్మకాలు జరుపుతూ వెనుక స్మోకింగ్ జోన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్మోకింగ్ జోన్‌లో ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు వేసి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మైనర్లే ఎక్కువగా ఈ జోన్‌లకు వెళుతున్నారు. పాఠశాల స్థాయిలో 9, 10వ తరగతి విద్యార్థుల నుంచి ఇంటర్, ఐటీఐ విద్యార్థులు ఈ జోన్‌లకు ఆకర్షితులవుతున్నారు. నిర్వాహకులు స్మోకింగ్ జోన్‌లకు సమయాన్ని బట్టి బిల్లులు వసూలు చేస్తున్నారు. అదే సమయంలో కొందరు గంజాయి వ్యాపారులు మైనర్లను ఉచ్చులోకి దింపుతున్నారు.

గంజాయి విక్రయాలు...

జిల్లాలో గంజాయికి బానిసైన విద్యార్థులు, యువకులు నిర్మానుష్యమైన ప్రాంతాలు, పొలాల్లో గంజాయి సేవించే వారు. ఇప్పుడు కేఫ్‌లు, పాన్ షాప్ ఏరియాల్లో స్మోకింగ్‌జోన్‌లు ఏర్పాటు కావడం, గంజాయి విక్రయాలకు, వినియోగాలకు సులభతరంగా మారాయి. పలు సందర్భాల్లో ఈ కేఫ్‌లలో మత్తు పదార్థాలు సేవించి యువకులు బయటకు వచ్చి గొడవలు పడి దాడులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

నిఘా లేకపోవడంతో నిర్భయంగా దందా...

జిల్లాలో స్మోకింగ్ జోన్ కేఫ్‌లను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా పోలీసులు నిఘా పెట్టకపోవడంతో దందా విచ్చలవిడిగా సాగుతోంది. ముఖ్యంగా యువత, మైనర్లు చెడు అలవాట్లకు బానిస కావడమే కాకుండా (మిగతా 8వ పేజీలో)

రామగుండంలోనే 40కిపైగా స్మోకింగ్ జోన్ కేఫ్‌లు...

జిల్లాలో విద్యా సంస్థలు ఎక్కువగా ఉండే మేజర్ గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఏరియాల్లో స్మోకింగ్ జోన్ కేఫ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రం పెద్దపల్లితోపాటు సుల్తానాబాద్, మంథని, కాల్వ శ్రీరాంపూర్, తదితర ప్రాంతాలతోపాటు రామగుండంలో ఈ తరహా కేఫ్‌లను నిర్వహిస్తున్నారు. ఒక్క రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనే 40కి పైగా స్మోకింగ్ జోన్ కేఫ్‌లు నిర్వహిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. విద్యాసంస్థలు ఎక్కువగా ఉండే మార్కండేయకాలనీ ఏరియా, అడ్డగుంటపల్లితో పాటు మేదరిబస్తీ, గౌతమినగర్, ఇందిరానగర్ పెట్రోల్‌బంక్ ఏరియా, ఆర్‌సీఓఏ క్లబ్, ఎల్‌ఐసీ ఆఫీస్ ఏరియాల్లో ఎక్కువగా స్మోకింగ్ జోన్ కేఫ్‌లు ఉన్నాయి.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలి

సుల్తానాబాద్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): రైతులు మోతాదుకు మించి ఎరువులను వినియోగిస్తూ భూసారాన్ని దెబ్బతీస్తున్నారని, సేంద్రియ ఎరువులను వాడి భూములను కాపాడుకోవాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు వరితోపాటు ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, వీటి ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని పేర్కొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూముల్లో సారవంతం పెరుగుతుందని, అధిక యూరియా వాడటం ద్వారా దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రజ్ఞుల సూచనల మేరకు ఆయిల్ పామ్ సాగు చేయాలని పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.60 వేల కోట్ల రైతు బోనస్ అందించామని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రస్తుతం రైతుల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారని, అలాంటి వారిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిన్నకలువలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎలాంటి కటింగు లు లేకుండా కొనుగోలు చేయాలని, రైతుల ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు ఖాతాల్లో జమ వుతాయని అన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, వ్యవసాయ ప్రాథమిక చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ పన్నాల రాము లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సహకార శాఖ రిజిస్టర్ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధి కారి పైడితల్లి, సీఈఓ రమేష్, డైరెక్టర్లు, పాల్గొన్నారు.

రేపటి నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

పెద్దపల్లిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని మార్కెట్ యార్డులు, సీసీఐ, ప్రైవేట్ కేంద్రాలకు ఈనెల 17 నుంచి పత్తి తీసుకొని రావద్దని కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పత్తి జిన్నింగ్ మిల్లుల విషయంలో విధించిన నిబంధనలు సడలించే వరకు 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ కొనుగోలు, ప్రైవేటు కొనుగోలు నిలిపివేస్తున్నట్లు జిన్నింగ్ మిల్లు యాజమాన్యం తెలిపారన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు రైతులు మార్కెట్‌కు, జిన్నింగ్ మిల్లు వద్దకు పత్తి తీసుకొని రావద్దని, స్లాట్ బుకింగ్ అయినా కూడా సీసీఐకి పత్తి తీసుకు రావద్దని తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు రైతులు పత్తిని అమ్మకానికి తీసుకొని రావద్దన్నారు.

న్యాయవాద దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు నోటీసులు?
- ఇప్పటికే నిందితులను విచారించిన అధికారులు
- అప్పటి పోలీస్ అధికారులను విచారించే అవకాశం... 7

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల పట్టివేత 6

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

గోదావరిఖనిలో గంజాయి విక్రయ ముఠా అరెస్టు

1.4కిలోల గంజాయి స్వాధీనం

ఆరు సెల్‌ఫోన్లు సీజ్ 6

గజ..గజ..

- కనిష్ఠ స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఇబ్బందుల్లో వృద్ధులు, చిన్నారులు, వ్యాధిగ్రస్తులు
- చలి మంటలు కాగుతున్న ప్రజలు

మంథని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. ఐదు రోజులుగా క్రమేపి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండటంతో చలికి ప్రజలు గజగజ వణుకుతున్నారు. చలి పంజా నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చలిపులి దెబ్బతో ప్రజలంతా బెంబేలెత్తి పోతున్నారు. చలికి తోడు తెల్లవారుజామున పొగ మంచు కప్పి వేస్తుంది. దీంతో ఉదయం 7.30 గంటలైనా పొగతో రహదారి అగుపించడం లేదు. పగలు వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల వరకు నమోదు అవుతుండగా సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ఉష్ణోగ్రతలు 9 డిగ్రీల కనిష్ఠ స్థాయికి పడిపోతుండటంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రజలు చలి మంటలు వేసుకొని వెచ్చదనం కోసం ప్రయత్నిస్తున్నారు. పగలు సైతం చలిగాలి వీస్తుంది.

రాత్రి, తెల్ల వారుజామున ప్రజలు చలి మంటలు కాగుతున్నారు. సాయంత్రం నుంచే స్వెటర్స్, ఉన్ని దుస్తులను ధరిస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు అత్యవసరం అయితేనే తప్ప దూర ప్రయాణాలు చేయడం లేదు. చలి తీవ్రతతో ప్రజలు రగ్గులు, దుప్పట్లను కప్పుకుంటున్నారు. చలి తీవ్రత క్రమేపి పెరుగుతుండటంతో అస్తమా వ్యాధిగ్రస్తులతో పాటు చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. చలి నుంచి రక్షించుకోవడానికి కుటుంబ సభ్యులు వారికి తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. తెల్లవారుజామున వివిధ గ్రామాల నుంచి కూరగాయలు, పాలను మార్కెట్‌కు తీసుకువచ్చే రైతులు, పేపర్ బాయ్స్, బస్టాండ్, ప్రధాన రహదారుల వెంట ఉన్న టీ స్టాల్స్ హోటళ్ల యజమానులు, మున్సిపల్ సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల నుంచి కూరగాయలు, పాలు తీసుకువచ్చే వారు చలి ప్రభావంతో ఇబ్బందులు పడుతున్నారు.

14 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

కళ్యాణ్‌నగర్: వారం రోజులుగా చలి పంజా విసురుతోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 16 డిగ్రీలకు పడి పోవడంతో మధ్యాహ్నం వేళలో కూడా చలి ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. సాయంత్రం వేళల్లో చలి తీవ్రతతో రోడ్డు నిర్మానుష్యంగా కనిపిస్తుండగా చలి తీవ్రతకు తట్టుకోలేక పలు కాలనీల్లో ప్రజలు చలి మంటలు వేసుకుంటున్నారు.



కాటమయ్య రక్షణ కవచాలతో భరోసా

- గీత కార్మికులకు ఉపయోగం
- పైలట్ ప్రాజెక్టుగా మూడు గ్రామాల్లో శిక్షణ పూర్తి

ఓదెల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాటమయ్య రక్షణ కవచాలు గీత కార్మికుల ప్రాణాలపై భరోసా కల్పిస్తున్నాయి. ఓదెల, కనగర్తి, కొలనూర్ గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గౌడ కుల వృత్తిదారు లకు కాటమయ్య రక్షణ కవచాల ఉపయోగం, వినియోగంపై శిక్షణ పూర్తయి మూడు నెలలు అవుతోంది. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఈ గ్రామాల్లో శిక్షణ విజయవంతంతో కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు మంచి ఫలితాలిస్తున్నాయి. దీంతో కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించినట్లయింది. తాడిచెట్టు పైనుంచి పడి గాయాలపాలు కాగ, మరి కొందరు గీత కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు వదిలిన సంఘటనలు కోకొల్లలు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేసి శిక్షణ చేపట్టడంతో గీత కార్మికుల ప్రమాదాలకు అడ్డుకట్ట పడినట్లయింది.

గౌడ కులస్తుల ప్రాణాలకు రక్ష.. వెంకటేశం గౌడ్ ఐఏఎస్ మార్గదర్శి

ప్రస్తుతం టీఎస్‌పీఎస్‌లో చైర్మన్‌గా ఉన్న బుర్ర వెంకటేశం గౌడ్ ఐఏఎస్ కాటమయ్య రక్షణ కవచాన్ని రూపొందించారు. జనగామకు చెందిన ఆయన తండ్రి వృత్తిలో భాగంగా కల్లు సేకరణకు వెళ్లి తాటిచెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గీత వృత్తిదారుల ప్రాణాలను కాపాడేందుకు శాశ్వత పరిష్కారానికి అంకురార్పణ ప్రారంభించాడు. ఇందులో భాగంగా పర్వతారోహణులపై దృష్టి పెట్టి వారితో రెండేళ్లుగా పరిశోధన చేసి రూపొందించారు. మొదటిసారిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మారుమూల పల్లెలో ప్రయోగించి ఫలితాన్ని చూశారు. గీత కార్మికుల వృత్తి ప్రాధాన్యతను, వారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే పరిస్థితి పై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో కాటమయ్య రక్షణ కవచాల తయారీకి సిద్ధం చేసి పైలట్ ప్రాజెక్టుల కింద గ్రామాలను ఎంపిక, శిక్షణ ప్రక్రియ పూర్తి చేశారు.



రక్షణ కవచం ఉపయోగాన్ని చూపిస్తున్న గీత కార్మికుడు ఓదెలలో రక్షణ కవచం వినియోగాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు (ఫైల్)

రక్షణ కవచాల సామర్థ్యం

పర్వతారోహణులు ఉపయోగించే రక్షణ కవచాల నుంచి పుట్టిందే కాటమయ్య రక్షణ కవచాలు. దీనికి ఉపయోగించే తాడు 22 క్వింటాళ్ల బరువు, బెల్టులు ఒక్కొక్కటి 15 క్వింటాల బరువు, వీటికి అమర్చుకున్న క్యారబినర్ కొండి 30 క్వింటాళ్ల బరువును మోస్తుంది.

రక్షణ కవచాలకు కాటమయ్య పేరెందుకు ?

ప్రభుత్వం చేపట్టిన రక్షణ కవచాల పంపిణీకి కాటమయ్య పేరెందు కనేది చాలామందికి ఆలోచనలు వచ్చాయి. వీటికి పేరు పెట్టడానికి కుల ఆచారాలు, నమ్మకాల నుంచి పుట్టిందే కాటమయ్య పేరు. ప్రతి గ్రామంలో తాటివనం ఉంటే అక్కడ గౌడ కులస్తుల ఇలవేల్పు రేణుక ఎల్లమ్మ ఆలయం ఉంటుంది. అలాగే గౌడ కులస్తులకు ఎల్లమ్మ ఎంత ముఖ్యమో తాటి వనానికి రక్షణగా ఉంటున్న కాటమయ్య విగ్రహం అంతే ముఖ్యం. తాటి వనానికి రక్షణ కాస్తున్నట్లు గౌడ కులస్తులకు ప్రగాఢ విశ్వాసం. ఇందులో భాగంగానే వారి విశ్వాసాలకు అనుగుణంగా రక్షణ కవచాలకు కాటమయ్య రక్షణ కవచాలుగా ప్రభుత్వం నామకరణ చేసింది. మోకు, గుయ్యిలు జారిపోయి ప్రమాదాలు, మరణాలను చవి చూసిన గీత కార్మికులకు రక్షణ కవచాలు ఎంతో ఉపయోగం. ఒకవేళ మోకు జారిపోతే చెట్టు పైన కూర్చున్నట్లు సురక్షితంగా కాటమయ్య రక్షణ కవ చాలు పనిచేస్తున్నాయి. గుయ్యి జారినప్పటికీ ముం దుగా అమర్చుకున్న రక్షణ కవచం ఉక్కు తాళ్లతో కట్టినట్లు సురక్షితంగా కింద పడకుండ కాపాడుతుంది.

బడ్జెట్ ను కేటాయించాలి

\- జాగిరి అంజి గౌడ్, కనగర్తి



కాటమయ్య రక్షణ కవచాల కోసం బడ్జెట్ ను కేటాయించి ఆదుకోవాలి. గత ప్రభుత్వంలో రక్షణ కవచాలకు నిధులు ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో కొంత అమలు జరుగుతున్నప్పటికీ నిధులు కేటాయించి ప్రతీ గీత కార్మికునికి రక్షణ కవచాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

గీత కార్మికులకు నమ్మకం కుదిరింది

\- నాగపూరి రవి గౌడ్ , ఓదెల



గీత కార్మికులకు రక్షణ కవచాలపై నమ్మకం కుదిరింది. రక్షణ కవచంతో తాటి చెట్టు పైన జారినా కూడా ఎలాంటి ప్రమాదం జరగకుండ చెట్టు పైన మళ్లి అమర్చుకొని కిందికి సురక్షితంగా దిగుతున్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

సర్టిఫికెట్ పోయినది

★ చిలుముల అఖిల్ S/o. బాస్కర్ సిరిసిల్ల బస్టాండ్‌కు వెళ్ళే దారిలో నాయొక్క టెన్త్ మెమో పోయినది. ఎవరికైనా దొరికినచో దయచేసి మాకు తెలియజేయగలరు. సెల్: 9949317688

AJK-250672

LOST PASSPORT

I, LANKA SURESH S/o. GANGADHAR H.No. 7-103/2, VEMULAKURTHY VILLAGE, IBRAHIMPATNAM MANDAL, JAGITHYAL DIST. While Travelling from VEMULAKURTHY to IBRAHIMPATNAM I LOST MY PASSPORT VIDE No. L9240142 ISSUED AT Hyderabad IF ANYONE Found PLEASE CONTACT CELL: 99494 55104

AJK-17450

ప్లాట్ అమ్మబడును

కరీంనగర్, చింతకుంట గాంధీనగర్‌లో దానరి విజయ గార్డెన్స్ ఎదురుగా రోడ్‌లో తూర్పు ఫేస్, 21ft. రోడ్, 39x30 సైజ్ 130 గజాల ప్లాట్ అమ్మబడును. నో బ్రోకర్స్. సెల్: 7382849187

AJK-250736

HOUSE FOR SALE

★ కరీంనగర్ జ్యోతినగర్‌లో ఉన్న 450 గజాల స్థలంలో ఇల్లు అమ్మబడును. 450 గజాల స్థలం మరియు ఇల్లుతో కలిపి మొత్తంగా అమ్మబడును. సెల్: 9849108465, 8309520255

AJK-250962

ADMISSIONS

★ Discontinue Admissions Final Year DMLT / DMPHA (M) / D.O.A / DMIT / DMST/ DANS / DRGA / Last Date: 29-11-2025, Sagar Paramedical College, Cell : 99639 37007, 81793 29761, 9515507707

AJK-250972

3+2 స్కీం కలదు

కావలెను

కొత్తపల్లి రైల్వే జంక్షన్ వద్ద ఉన్న 2 ఎకరాల వ్యవసాయ భూమిలో పని చేయడానికి BSE అగ్రికల్చర్ చదివిన వ్యక్తి అవసరం ఉన్నది. ఆ వ్యక్తికి అన్ని రకాల పండ్ల చెట్లు, పుష్పాలు మరియు సిరిధాన్యాలు పెంచడంలో అనుభవం ఉండాలి. జీతం: రూ. 10,000 నుండి రూ. 15,000 వరకు ఉంటుంది, అదనంగా లాభాల్లో భాగస్వామ్యం ఉంటుంది. వివరాలకు: రాజు, whatsapp ✆: 9381515625 నందు సంప్రదించగలరు, raj8834@hotmail.com

AJK-250915

PROPERTY FOR SALE

★ 600 Sq.Yds Plot For Sale Near Satavahana University. Ph.: 9346394816 / 9573999953

AJH-3263

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

విద్యుదాఘాతంతో రైతు మృతి



జయసింహారెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఎస్సై సీహెచ్‌గణేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. ఆవునూర్ గ్రామానికి చెందిన బద్ది జయసింహారెడ్డి(65) అనేరైతు తన వ్యవసాయపొలం వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు బోర్‌మోటార్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు భానుచందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి



సరేందర్(ఫైల్)

జమ్మికుంట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గుల్లి సరేందర్ (50) ప్రమాదవశాత్తు రైలు కింద పడి శనివారం మృత్యువాత పడ్డాడు. సరేందర్ సుతారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పక్షవాతం రాగా, కొద్ది నెలల క్రితం తిరిగి కోలుకున్నాడు. ప్రస్తుతం సుతారి పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా మడిపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఉన్న రైల్వేగేట్ వద్ద ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

బాలిక ఆకస్మిక మృతి



రెడ్డి అర్చన(ఫైల్)

సైదాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలం సర్వాయిపేట పంచాయతీ పరిధిలోని శివరాంపల్లిలో రెడ్డి అర్చన (16) ఆకస్మికంగా మృతిచెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివరాంపల్లికి చెందిన అర్చన సోమారం మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్ర వారం సాయంత్రం తల్లిదండ్రులతో సరదాగా గడిపి రాత్రి నిద్ర పోయిన అర్చన ఉదయం లేచేసరికి మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అర్చన తండ్రి రెడ్డి రాజు ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టుతో బాలిక మృతి కారణం తెలిసే అవకాశం ఉంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో శిక్ష పడుతుందని యువకుడి బలవన్మరణం



సూర విజయ్(ఫైల్)

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌కేసులో శిక్ష పడుతుందనే భయంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్‌రెడ్డి, విజయ్ తల్లి ఫిర్యాదు మేరకు... చొప్పదండి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సూరవిజయ్(28) చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. విజయ్‌కి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈనెల 1న చొప్పదండి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీలు చేస్తుండగా విజయ్ పట్టుబడ్డాడు. విజయ్‌పై కేసు పెట్టిన పోలీసులు శుక్రవారం కోర్టుకు తీసుకెళ్లారు. మేజిస్ట్రేట్ సెలవులో ఉండడంతో విజయ్‌తిరిగి ఇంటికి వచ్చాడు. వచ్చిన తర్వాత కేసులో శిక్ష పడుతుందని, ఫైన్ కట్టడానికి డబ్బులు లేవని భార్యతోవిజయ్ చెప్పాడు. మనస్తాపం చెందిన విజయ్ శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయ్‌తల్లి నాగమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి టిప్పర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల-రాగట్లపల్లి గ్రామాల మధ్య రహదారిలో అదుపుతప్పి టిప్పర్ వ్యవసాయ పొలంలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇక్కట్లు

● ఇసుక, కంకర ధరల పెరుగుదల





హుజూరాబాద్‌లో ఇసుక లేక మధ్యలోనే వదిలేసిన ఇందిరమ్మ ఇంటి పనులు

హుజూరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇసుక, కంకర ధరలు పెరగడం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో కొందరు ఇళ్ల నిర్మాణ పనులు నిలిపివేశారు. రెండు నెలలుగా ఇసుక, కంకర ధరలను వ్యాపారులు ఇష్టానుసారంగా పెంచేశారు.ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రులకు చేసిన ఇళ్ల నిర్మాణాల ఆధారంగా డబ్బులు జమ చేసింది. ఆ డబ్బులు సరిపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

హుజూ రాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట,వీణవంక మండలాల్లో మానేరు వాగు ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు వాగు ప్రవ హించడంతో ఇసుక దొరకడం లేదు. దొరికిన ఇసుక ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున దోపిడీ చేస్తున్నారు. దళారులే ధరలు పెంచుతు న్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. హు జూరాబాద్ నియోజకవర్గంలో జమ్మి కుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజూరాబాద్, కమలాపూర్ మండలాలు ఉండగా, అందు లో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యా యి. ఆరునెలల క్రితం ట్రాక్టర్ ఇసుక రూ.2800నుంచి రూ.3వేల వరకు లభిం చింది. అంతేకాకుండా గృహ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండడంతో క్రషర్ యజమానులు కంకర ధరలను కూడా పెంచేశారు. ఓ వైపు కంకర, మరో వైపు ఇసుక ధరలు పెంచడంతో సామా న్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, కంకర దళారులను అరికట్టడంలో రెవెన్యూ, పోలీసులు విఫలమయ్యారనే ఆరోపిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసు కను ఉచితంగా లేదా రాయితీపై అందించాల్సి ఉండగా పట్టించుకోవడ లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, కంకరను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12ట్రాక్టర్లను శనివారం రెవెన్యూసిబ్బంది, పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలం నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతోపాటు పలు గృహాల నిర్మాణాలకు ఈ ప్రాంతంలోని మానేరువాగు నుంచి ఇసుకను ఉచితంగా ట్రాక్టర్ల ద్వారా రవాణాచేయడానికి అనుమతి ఉంది. ఉదయం8నుంచి సాయంత్రం 5గంటల వరకు మానేరువాగు నుంచి ఇసుక ట్రాక్టర్లు రవాణా చేయాల్సి ఉండగా, నిబంధనలకు వ్యతిరేకంగా తెల్లవారుజాము నుంచే ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొన్నిచోట్ల డంప్‌చేసి, అధికధరలకు విక్రయించుకుంటూసొమ్ము చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమంగా ఇసుకతరలిస్తున్న 12ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ వినోద్ తెలిపారు.



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 20మందికి గాయాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..





లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ప్రమాద స్థలంలో రోదిస్తున్న మహిళ

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

మానకొండూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద ఆర్టీసీ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం నిజామాబాద్ నుంచి వరంగల్‌కు బయల్దేరింది. మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ బ్రేక్ వేయడంతో వెనక నుంచి ఆర్టీసీ బస్సు దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో సీట్లలో కూర్చున్న 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డవారిలో నిజామాబాద్, జగిత్యాల, హుజూరాబాద్, వరంగల్ జిల్లాల ప్రయాణికులు ఉన్నారు. ఘటనలో బస్సు డ్రైవర్ వైపు ఉన్న అద్దం పగిలిపోయింది. ప్రమాదానికి గురైన బస్సును, లారీని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు వేగంగా వెళ్లవద్దని బస్సు డ్రైవర్‌కు సూచించినా పట్టించుకోలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో ట్రాలీ బోల్తా పడి..

జమ్మికుంట : జమ్మికుంట మండలం తనుగుల శివారులో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటో ట్రాలీ శనివారం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. వీణవంక మండలం ఎల్బాక గ్రామానికిచెందిన 25మంది వ్యవసాయ కూలీలు జమ్మికుంట మండలం నాగారం గ్రామంలో పత్తి ఏరడానికి ఆటోట్రాలీలో ఉదయం ఇంటి నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో తనుగుల శివారులోని గుంపుల క్రాస్‌రోడ్ వద్ద ప్రమాదవశాత్తు ఆటోట్రాలీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా, మరో 21మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108అంబులెన్స్‌లో జమ్మికుంటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణగౌడ్ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగినట్లు పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి..

ఇల్లంతకుంట : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన కూస అంజిరెడ్డి అనే ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపాక గ్రామంలో శనివారం జరిగిన వారసంతకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ప్రమాదంలో అంజిరెడ్డి గాయపడగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

ఎలిగేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ ఎదుట గల చౌరస్తాలో శనివారం ఉదయం ఇసుక ట్రాక్టర్ ఢీకొని పెద్దెల్లి సుధీర్(50) మృతిచెందినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన సుధీర్ గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీగా ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుల్తాన్‌పూర్‌లో ఎదురుగా అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధీర్ ఛాతిపై నుంచి ట్రాక్టర్ వెనుకటైర్లు వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ శశికుమార్ అజాగ్రత్తగా వేగంగా నడపడం వల్లే ఈ దుర్ఘటన జరిగినట్లు ఆయన తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించగా, మృతుడి భార్య పెద్దెల్లి ఉమా ఫిర్యాదుమేరకు డ్రైవర్ శశికుమార్, యజ మాని ఆవుల సంపత్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామశివారులో శుక్రవారం కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తాటిపల్లి గ్రామానికి చెందిన ఒజ్జల గంగాధర్(55) చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ కథనం ప్రకారం గంగాధర్ తన స్వగ్రామం తాటిపల్లి గ్రామం నుంచి జగిత్యాలకు పనినిమిత్తం బైక్‌మీద వెళ్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గంగాధర్‌ను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

దొంగతనాల కేసుల్లో ఆరుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, రాగితీగ

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో కొన్ని నెలలుగా రైతులు, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించిన, దొంగతనాల కేసులకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీ స్‌కమిషనర్ గౌస్‌ఆలం వివరాలు వెల్లడించారు. చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ చౌరస్తావద్ద శనివారం పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు వాహనాలను తనిఖీచేయగా దొంగతనాలకు సంబంధించి నిందితులను పట్టుకున్నారు. చొప్పదండి, చిగురుమామిడి, మానకొండూర్, గంగాధర, కరీంనగర్‌రూరల్, రామడుగు, ఎల్ఎండీ, దుగ్గొండి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వారు 15దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. కట్టరాంపూర్‌కు చెందిన మనుపాటి శేఖర్, చొప్పదండికి చెందిన మనుపాటి సంజీవ్, బేగంపేటలోని రామగిరికి చెందిన ఉండాటి మహేశ్, ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు చెందిన బోదాసు కుమార్, కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్‌కు చెందిన సాగర్ల రంజిత్, చొప్పదండికి చెందిన బొడిగె స్క్రాప్‌వ్యాపారి సంపత్(రిసీవర్)ను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రెండు పికప్ వాహనాలు, ద్విచక్రవాహనం, 3క్వింటాళ్ల కాపర్ వైరు స్వాధీనం చేసుకున్నామని, వాటి మొత్తం విలువ సుమారు రూ.20 లక్షలుగా ఉంటుందని సీపీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కేసులకు సంబంధించి పరారీలో ఉన్న మిగతా 8మందికోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

● **సీపీ అభినందనలు**

కరీంనగర్‌రూరల్ ఏసీపీ విజయకుమార్ నేతృత్వంలో కేసులను ఛేదించగా బృందంలోని ప్రదీప్‌కుమార్(సీఐ చొప్పదండి), సంజీవ్ (సీఐ మానకొండూర్), నరేష్ రెడ్డి(ఎస్సై), వంశీకృష్ణ(ఎస్సై గంగాధర) సిబ్బంది అనిల్, రాజ్‌నాయక్, హేమసుందర్, శ్రీనివాస్, హసనొద్దీన్, రవీందర్, సృజన్‌ను సీపీ గౌస్ ఆలం అభినందించారు.

పోలీసుల పేరుతో దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్టు



నిందితులను అరెస్ట్ చూపుతున్న డీసీపీ కరుణాకర్

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాతనేరస్తులు ఒక ముఠాగా ఏర్పడి పోలీసులమంటూ దోపిడికి పాల్పడి అడ్డంగా దొరికిపోయారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల అరెస్టును చూపారు. డీసీపీ మాట్లాడుతూ రేగడిమద్దికుంటకు చెందిన నాగుల కుమారస్వామి, కాల్వశ్రీరాంపూర్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన తిప్పని రవీందర్, పోవరి శ్యాంరావు, సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌కు చెందిన పురుషోత్తం నాగరాజులు ముఠాగా ఏర్పడ్డారు. వారి అప్పులు తీర్చేందుకు గతంలో మావోయిస్టు పేరుతో డబ్బులు వసూలు చేసిన నాగుల కుమారస్వామి పోలీసుల పేరుతో దోపిడి చేయాలనే ఆలోచన చేశారు. నలుగురిలో ముఠా సభ్యుడైన పురుషోత్తమ నాగరాజు దోపిడీ కోసం గర్రెపల్లిలోని బంధువుల ఇంటినే ఎంచుకున్నారు. నలుగురు కలిసి ఈ నెల10న గర్రెపల్లిలోని సంగం లక్ష్మి ఇంటికి తెల్లవారుజామున చేరుకొన్నారు. తలుపులు తీసిన లక్ష్మితో తాము కరీంనగర్‌కు వన్‌టౌన్ పోలీసులమని, కరీంనగర్‌లో మీ కొడుకు రమేష్ పని చేస్తున్నాడని, అతని యజమాని దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నాడని, అతనికి సంబంధించిన దొంగ నోట్లను ఇంట్లో దాచిన సమాచారం మేరకు ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంట్లో నిద్రపోతున్న రమేష్‌ను లేపి చేతికి బేడీలను వేసి బీరువా తీయాలని బెదిరించి అందులోని బ్యాగును తీసుకొని, బంగారం, వెండి, నగదును తీసుకొని వెళుతూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని పేర్కొన్నారు. అయితే వచ్చిన వారు నకిలీ పోలీసుల గ్రహించి బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, సనత్‌రెడ్డి, వెంకటేష్‌లు బృందాలుగా విడిపోయి దొంగల ఆచూకీకి ప్రయత్నించగా శనివారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.11.50లక్షల విలువగల 115 గ్రాముల బంగారం, రూ.50వేల విలువగల 472 గ్రాముల వెండి, రూ10వేల నగదుతో పాటు దోపిడికి ఉపయోగించిన రెండు కార్లు, ఒకబైక్, పోలీస్ దుస్తులు, బేడీలను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐలతోపాటు హెడ్‌కానిస్టేబుల్ పలువురు పోలీసులకు డీసీపీ నగదు రివార్డులను అందజేశారు. సమావేశంలో ఏసీపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

పెద్దపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి వివాహం చేసుకొని ఆరునెలల అనంతరం వద్దని చెప్పడంతో భర్త ఇంటి ఎదుట బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళన చేసిన సంఘటన పెద్దపల్లి మండలంలో చోటుచేసుకుంది. బొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మేరపల్లికి చెందిన బోదాసు అభిషేక్ అదేగ్రామానికి చెందిన దండుగుల శ్రీలతను ఆరునెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఆరునెలలపాటు ఇద్దరు కలిసి పెద్దపల్లిలో నివసించినట్లు తెలిపారు. కొన్నిరోజుల క్రితం పెళ్లిచేసుకున్న వ్యక్తి తననువద్దని తెలుపడంతో ఇంటిఎదుట బైఠాయించినట్లు పేర్కొన్నారు. స్థానిక పెద్దలసమక్షంలో ఒప్పందం కుదుర్చుకోవడంతో గొడవ సద్దుమనిగినట్లు తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్‌రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ సెక్రెటరీ జెజె రత్నం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీసంస్థలో 35నుంచి 40సంవత్సరాలు పనిచేసిన వారికి ఇబ్బందులు తపపడం లేదని తెలిపారు. 2017లో ఇవ్వాల్సిన పీఆర్‌సీ 2021లో ఇవ్వగా 2017నుంచి చెల్లిం చాల్సిన పీఆర్‌సీ ఏరియర్స్ ఇంతవరకు రాలేదని పేర్కొన్నారు. 2017లో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఇంతవరకు రాలేదన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీఅధికారులు చొరవ తీసుకోవాలని, ఆదుకోవాలని కోరారు.

గోదావరిఖనిలో గంజాయి విక్రయ ముఠా అరెస్టు

● 1.4కిలోల గంజాయి స్వాధీనం ● ఆరు సెల్‌ఫోన్లు సీజ్



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర బల్లార్ష నుంచి గోదావరిఖనికి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్, పవర్‌హౌస్‌కాలనీకి చెందిన కొప్పులసాయి ధనుష్, మంచికట్ల అక్షయ్, సప్తగిరి కాలనీకి చెందిన మాటూరి సాత్విక్, అంతర్గాం రాజాపురంకు చెందిన చిలుక వినీత్, రామగుండం రైల్వే స్టేషన్ ఏరియాకు చెందిన బూక్య రాజేష్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వారు వినియోగిస్తున్న ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. స్థానిక కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్ కూలీ చేసుకుంటుండేవాడు. జల్సాలకు అలవాటు పడి బల్లార్ష నుంచి గంజాయి తీసుకువచ్చి గోదావరిఖని, ఇతర ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో గోదావరిఖని, రామగుండంకు చెందిన యువకులతో పరిచయం ఏర్పడింది. వీరంతా గంజాయికి బానిసలై గంజాయి రవాణా, విక్రయాలు జరుపాలని నిర్ణయించుకున్నారు. మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయించేవారు. శుక్రవారం కాకతీయనగర్ వాటర్ ట్యాంకు వద్ద గంజాయి అమ్మకాలకు ప్రయత్నిస్తున్న చిక్కుడు రాహుల్‌ను పట్టుకుని అతని వద్ద 900గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో కొప్పుల సాయి ధనుష్, చిలుక వినీత్, మంచికట్ల అక్షయ్, మాటూరి సాత్విక్, బూక్య రాజేష్‌లను పట్టుకుని వారి వద్ద 500గ్రాముల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ రమేష్, క్రైమ్‌పార్టీ సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, శ్రీనివాస్, సదానందం, కానిస్టేబుళ్లు ప్రకాష్, రమేష్, మధుకర్, మధుసూదన్‌లను సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌లు అభినందించారు.

మృతిపై ఫిర్యాదు

ముత్తారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సొన్నాయిల మధునయ్య(80) మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కాసర్లగడ్డకు చెందిన అనుము రామస్వామి ముత్తారం పోలీసులకు శనివారం ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడి కుమార్తె ముబ్బు స్నేహలత తండ్రి అనారోగ్యంతో బాధ పడుతున్నాడని ఈ నెల 14న ఆమె వెంట తీసుకెళ్లిందని, అదే రోజు సాయంత్రం మధునయ్య ఆరోగ్యం బాగాలేదని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నాడు. చికిత్స పొందుతూ మరణించాడని స్నేహలత తెలిపారని రామస్వామి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆయన మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోస్టుమార్టం జరిపించాలని మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, తదితరులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీలు వేర్వేరుగా హాజరై స్వామివారి సన్నిధుల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువులు హైందవ ధర్మం పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేములవాడలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. పురాతన దేవాలయాలు, హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషిచేయాలన్నారు. అంతకుముందు ఆలయంలో యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, శివపార్వతుల కల్యాణం, స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దర్శనాలకు నిలయం.. భీమేశ్వరాలయం

- విశాలంగా ఆలయ ఆవరణ
- కోడెల మొక్కులు సులభతరం
- భక్తుల రద్దీకి అనువైన స్థలం
- రథశాలలోకి ఆర్జిత సేవల బుకింగ్ కార్యాలయం
- భీమేశ్వర సదన్‌లో అధికారిక కార్యకలాపాలు



భీమేశ్వరాలయంలో భక్తులు (ఫైల్)

ముఖ్య బుకింగ్ కౌంటర్

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో విస్తరణ పనుల నేపథ్యంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో భీమేశ్వరాలయం భక్తులకు కేంద్రమైంది. ప్రస్తుతం భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలు సులభం అవుతోంది. ఆలయంలో విశాలమైన ఆవరణ ఉండడంతో కోడెల మొక్కులు చెల్లించే భక్తులకు అనువుగా ఉంది. దీంతో స్పెషల్ కోడే, సాధారణ కోడె మొక్కులు చెల్లించే భక్తులకు ఇక్కట్లు తగ్గాయి. వేలాది మంది భక్తులు వచ్చినా దర్శనం చేసుకునే అవకాశం ఉంది.

● రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్

భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలు నిర్వహించే భక్తులకు ముఖ్య బుకింగ్ కౌంటర్‌ను రథశాలకు మార్చారు. గత ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆర్జిత సేవలు చేసుకునే భక్తు లకు టికెట్ తీసుకోవడం గగనమైంది. బుకింగ్ కౌంటర్‌లో భక్తులు తోసుకోవడంతో క్యూలైన్ బారికేడ్ పక్కకు జరిగిపోయింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌లో అన్ని ఆర్జిత సేవల టికెట్లు తీసుకొని పూజలు చేసుకోవచ్చు.



ఉత్తరం వైపు ఏర్పాటు చేసిన రేకుల ఫెన్సింగ్

● భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు

పాత భవనాలన్నీ తొలగించడంతో భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గత నెల నుంచి సదన్ పైఅంతస్తులో ఈవో కార్యాలయం ఏర్పాటు చేశారు. కింది అంతస్తులో ఇంజనీరింగ్ కార్యాలయం ఏర్పాటు చేసి కార్యకలాపాలు సాగిస్తున్నారు. భీమేశ్వర గెస్ట్ హౌజ్-1లో ప్రోటోకాల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో వీఐపీలు, ఇతర సిఫారసు లేఖలు ఉన్న వారు సంప్రదిస్తే దర్శనం ఏర్పాట్లు చేస్తారు. మరో భీమేశ్వర గెస్ట్ హౌజ్-3లోకి ప్రసాదాల తయారీ కేంద్రం ఏర్పరచి లడ్డూలు, పులిహోర ప్రసాదాలు తయారుచేస్తున్నారు.

పాఠశాలల మూసివేత తగదు

● కిష్టంపేట పాఠశాలను సందర్శించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

చందుర్తి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను మూసివేయడం తగదని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్రఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట ఉన్నతపాఠశాలను మూసివేయడాన్ని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీబృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండువేల జనాభా కలిగిన గ్రామంలో పాఠశాలకు రావలసిన వయసు కలిగిన విద్యార్థులు దాదాపు 200మంది వరకు ఉన్నప్పటికీ పాఠశాలలో విద్యార్థులు లేరని మూసివేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సందర్భంలో పాఠశాలలు మూసివేయమని గతంలో మూతబడిన పాఠశాలలను ఒక్క విద్యార్థి ఉన్న తెరుస్తామని వాగ్దానం చేశారు. కానీ గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో వేలాది పాఠశాలలను విద్యార్థుల సంఖ్య తగ్గిందని, విద్యార్థులు రావడంలేదని అనేక పాఠశాలలను మూసివేశారన్నారు. దీనిని విద్యాపరిరక్షణకమిటీ తీవ్రంగా నిరసిస్తున్నదన్నారు. ప్రస్తుతం కిష్టంపేట పాఠశాలలో అన్ని సౌకర్యాలు గదులు తగినంత మంది ఉపాధ్యాయులు ఉన్నందున జిల్లా విద్యాధికారి, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై అశోక్ కుమార్ సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘుశంకర్‌రెడ్డి, కార్యదర్శి కే రవిచందర్, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, ఉపాధ్యాయ ఐకాస జిల్లా కో-కన్వీనర్ విక్కుర్తి లక్ష్మీనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ము రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టంపేట పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ బృందం

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలోగల శేషప్ప కళావేదిక పై హైదరాబాద్ పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శన శనివారం ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూడిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ మాజీచైర్మన్ సంగనభట్ల దినేష్, ఆలయఈవో సంకటాలశ్రీనివాస్, వేదపండితులు, అర్చకుల చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గంటల తరబడి చిన్నారులచే నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శనలను భక్తులు ఎంతో ఓపికతో తిలకించారు.

చిన్నారులను ఆలయం పక్షానచైర్మన్, ఈవో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదిత, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం

● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు నోటీసులు? ● ఇప్పటికే నిందితులను విచారించిన అధికారులు
● అప్పటి పోలీస్ అధికారులను విచారించే అవకాశం...

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు గట్టు వామన్‌రావు, నాగమణి దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసునమోదు చేసిన సీబీఐ విచారణ ప్రారంభించింది. రామగుండం పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా ఈ విచారణ జరుపుతున్నారు. వామన్‌రావు తండ్రి కిషన్‌రావు నుంచి వాంగ్మూలం తీసుకున్న సీబీఐ అధికారులు హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. రెండు మాసాలుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురిని ఇప్పటికే విచారించింది. ఈ విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధును విచారించాలని నిర్ణయించిన సీబీఐ ఆయనకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. పుట్టమధు సోమవారం గోదావరిఖనిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ప్రాంగణంలో సీబీఐ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. సీబీఐకి చెందిన డీఎస్పీస్థాయి అధికారులు మధును విచారించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే మధును విచారించాల్సిన అంశాలపై నోట్ సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ కేసులో ఏ3గా ఉన్న పుట్ట మధు మేనల్లుడు బిట్టును సీబీఐ అధికారులు విచారించారు. న్యాయవాద దంపతులను 2021 సెప్టెంబరు 17న మంథని కోర్టు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వచర్ల వద్ద నడిరోడ్డుపై హత్య చేశారు. ఈ కేసులో అప్పటి కమిషరేట్ అడిషనల్‌డీసీపీ(అడ్మిన్) అశోక్ కుమార్ విచారణాధికారిగా వ్యవహరించారు. అప్పటి రామగిరి ఎస్ఐ మహేందర్, విచారణ అధికారి అశోక్‌కుమార్‌ను సీబీఐ విచారించే అవకాశం ఉంది.

ఈ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఐజీ, పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు కేసు పురోగతిని సమీక్షించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరుపుతుండడంతో ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇప్పటికే ఫైళ్లను స్వాధీనం చేసుకున్న సీబీఐ పోలీస్ విచారణలోని లోపాలపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తుంది.

విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను రద్దు చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్‌టీచర్స్‌ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్రఅధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో పర్యవేక్షణకు డిప్యూటేషన్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించకూడదన్నారు. గత పీఆర్సీ గడువుముగిసి రెండేళ్లు గడుస్తున్న నూతన పీఆర్సీని ప్రకటించకపోవడం ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. హక్కుల సాధనకు నిర్వహించనున్న ఉద్యమాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని అనిల్ కుమార్ కోరారు. సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు రామచంద్రం, శ్రీనివాస్,సతీష్, గంగయ్య, రమేశ్, శ్రీకాంత్, సురేందర్‌పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కార్తీక పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భీమేశ్వరాలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. శని, ఆదివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. కోడె క్యూలైన్, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, లడ్డు కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో భక్తులకు ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎల్లాగౌడ్, డీఈ మధు రఘునందన్, ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం..


భీమేశ్వరాలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. మహిళలకు వాయినం అందజేశారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించి పూజలుచేశారు. యమధర్మ రాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తిశ్రద్దలతో పూజలు జరిపారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంవద్ద నాగదేవతకు, రావిచెట్టు ఆంజనేయస్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనేకమంది దీపాలు వెలిగించి భక్తి శ్రద్దలతో పూజించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు,అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షానఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.



ధర్మపురిలో భక్తుల రద్దీ



కొండగట్టులో భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

గోదావరి హారతి..

ధర్మపురి: కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరిహారతి 25వరోజు శని వారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి

కొండగట్టులో పెద్దపల్లి జిల్లా వాసి కిడ్నాప్

● తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు

● ముగ్గురిపై కేసు

మల్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన పెద్దపల్లి జిల్లాకు చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి కిడ్నాప్ కాగా తప్పించుకొని వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎల్కలపల్లికి చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి లోన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలల క్రితం గడ్డి నాగరాజు, బూర బాబులకు భూమిపై పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తానని రూ.పది లక్షల మేర వసూలు చేశాడు. రుణం ఇప్పించకపోవడంతో ఐదు నెలలుగా తమ డబ్బులు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ఇవ్వడం లేదు. దీంతో బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రమేష్‌ను నాగరాజు, బాబు కారులో వేములవాడకు తీసుకెళ్లారు. అక్కడ ముడికే అంజయ్య అనే మరో వ్యక్తితో కలిసి రమేశ్‌ను హైదరాబాద్‌కు తరలించి ఓ హోటల్లో బంధించి డబ్బులు ఇవ్వాలని దాడి చేశారు. అనంతరం రమేశ్‌ను శుక్రవారం రాత్రి వేములవాడకు తీసుకువచ్చి ఓ గదిలో ఉంచగా శనివారం అక్కడి నుంచి తప్పించుకొని మల్యాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనను కిడ్నాప్ చేసిన నాగరాజు, బాబు, అంజయ్యపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

18న ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు సమావేశం

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని షాదీఖానాలో ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల మసీదు ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజిమెంట్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ అజ్మతుల్లా హుస్సేన్ జిల్లా పర్యటన సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశామని, దీనికి ఉమ్మడి జిల్లాల మసీద్, ఈద్గా, కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల కరీంనగర్‌లో 2025-26 విద్యాసంవత్సరం పీజీ కోర్సుల్లో ఖాళీల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఎంఏ(ఇంగ్లీష్), ఎంఏ (తెలుగు), ఎంకాం, ఎమ్మెస్సీ(బోటనీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(ఫిజిక్స్), ఎమ్మెస్సీ(జువాలజీ) కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో ఈనెల17వ తేదీ సోమవారం సాయంత్రం 5గంటలలోపు అందజేయాలని తెలిపారు. 18వ తేదీన సిపిగేట్-2025 నిబంధనలప్రకారం అర్హతలు ఉన్న వారికి సీటు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లో సీటులభించిన విద్యార్థినులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదని, నిర్ణీత ఫీజు కళాశాలలో చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శ్రీరాంసాగర్‌కు స్థిరంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీకాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు ప్రారంభం

● ఉమ్మడి పది జిల్లాల నుంచి 330 మంది హాజరు
● పోటీలను ప్రారంభించిన డీఈవో శ్రీరామ్ మొండయ్య



యోగాసనాలు వేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) యోగా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రామడుగు మండలం వెలిచాల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి అండర్-14, 17 బాలబాలికలు, మొత్తం 260 మంది క్రీడాకారులు, 60 మంది అధికారులు, 30మంది అఫీషియల్స్ హాజరయ్యారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగాను ఒక క్రీడగానే కాకుండా నిత్య జీవితంలో భాగంగా ప్రతీరోజు అభ్యాసం చేయాలన్నారు. యోగాతో ఆరోగ్యం, ఆనందం పొందుతామన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేయాలన్నారు. జాతీయస్థాయి యోగా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య, ఎంఈవో రంగనాథ శర్మ, వెలిచాల పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, పోటీల రాష్ట్ర పరిశీలకులు సతీష్, శ్రీనివాస్, జిల్లావ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ అధ్యక్షులు బాబు శ్రీనివాస్, నిర్వహణ కమిటీ బాధ్యులు వీర్ల హనుమంతరావు, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, వెలిచాల యూత్ సభ్యులు, నర్సింగరావు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ దత్తాద్రి శర్మ, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధారెడ్డి, బాధ్యులు శర్మ, కోచ్ రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ సభ్యులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మత్తు కేఫ్‌లు...

(5వ పేజీ తరువాయి)

గంజాయి వంటి మహమ్మారి బారిన పడుతున్నారు. కొన్ని చోట్ల వీటిపై సమాచారం ఉన్నా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ప్రధాన రహదారులు, విద్యా సంస్థల సమీపంలో ఈ సెంటర్లు నిర్వహిస్తున్నా వాటిని కట్టడి చేయకపోవడంపై పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. ఎక్సైజ్‌శాఖ కనీసం తనిఖీలు చేసిన పరిస్థితి లేదు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఓదెల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన జూబ్లీహిల్స్ ఎన్నికలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపునకు కృషి చేసిన మంత్రి గడ్డం వివేక్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు ఆయనను హైదరాబాద్‌లో కలిశారు. నాయకులు అల్లం సతీష్ మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు.

రైతుల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం కృషి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కీచులాటపల్లి, వెంకట్రావుపల్లి, కాచాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. విండో చైర్మన్ వేణుగోపాల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహాయాదవ్, కాంతయ్య, బండి స్వామి, డైరెక్టర్ రేవెల్లి సమ్మయ్య, రాజయ్య, భూమయ్య, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, వైస్ చైర్మన్ అరిగె లింగయ్యలతో కలిసి ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ కొనుగోలు సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రంలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు రైతులు, గ్రామస్థులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలపారు. డైరెక్టర్లు ఉత్తం రాజయ్య, ఓరెం చిరంజీవి, నార లక్ష్మన్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని మారుతీ నగర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆర్ఎస్‌కే ఫౌండర్ రేండ్ల శారద కుమారస్వామి ప్రారంభించారు. కల్వచర్ల, మారుతీనగర్ రైతాంగానికి అందుబాటులో ఉండేందుకు సొంత భూమిని ఐకెపి సెంటర్ నిర్వహణ కోసం కేటాయించారు. స్థలం కేటాయింపుకు సహకరించిన భాగస్వాములు రావికంటి సతీష్, గర్రెపల్లి రమేశ్‌లకు రేండ్ల శారదకుమారస్వామిలు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం

ఎలిగేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి వరకు 36 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.99.69 కోట్ల నిధులు మంజూరు చేయించడంపై మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నమిండ్ల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును శనివారం శివపల్లిలో ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే మూడు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు.

అధ్యయనంతోనే అభివృద్ధి సాధించవచ్చు



పుస్తక ప్రదర్శనశాలను ప్రారంభిస్తున్న ఏఎన్‌ఓ షేక్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిరంతర అధ్యయనంతోనే అభివృద్ధి సాధించవచ్చని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్‌తో కలిసి పుస్తక ప్రదర్శనశాలను ప్రారంభించారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతోపాటు దానికి అనుసంధానంగా వివిధ పుస్తకాలను చదివి విజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. తమ పాఠశాలలో ఉన్న లైబ్రరీ బుక్స్‌ను చదివి విజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. టీచర్ హసేన్, గ్రంథాలయ జూనియర్ అసిస్టెంట్ గఫార్, యూనుస్ ఖాద్రీ, సిబ్బంది మౌళి, స్వరూప, పాఠకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ సాగుపై మాట్లాడుతున్న అధికారులు

ముత్తారం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయని ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచించారు. శనివారం ముత్తారం రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులకు అవగాహన కల్పించారు. ఈ తోటలు సాగు చేయడం వల్ల చీడపీడలు సోకే ఆస్కారం తక్కువగా ఉంటుందని, మొక్కలు నాటిన నాలుగేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమవుతుందని, యేటా ఎకరానికి 8 నుంచి 12 టన్నుల ఆయిల్‌పామ్ కాయలు దిగుబడి వస్తాయని తెలిపారు. మొక్కలు నాటే విధానం, నీటి వినియోగం, సస్యరక్షణ విధానాలను రైతులకు వివరించారు. ఫాక్స్ చైర్మన్ యాదగిరి రావు, ఎస్ఐ సురేందర్ రెడ్డి, సీఈఓ ప్రసాద్, వ్యవసాయ అధికారి అనూష, ఎఈఓలు సౌమ్య, హారిక, శ్రీలేఖ, హెచ్ఈఓ రాజశేఖర్, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, రైతులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో ఐక్యతా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యాసంస్థల అధికారులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో ఐటీఐ నుంచి యూనిటీ మార్చ్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో గ్రాడ్యు యేట్ ఎమ్మెల్సీ చిన్నమాయిల్ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్ర ప్రతీ ఒక్కరు తెలుసుకొని స్ఫూర్తి పొందాలన్నారు. సర్దార్ పటేల్ సాహసంతోనే కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశాన్ని ఏకం చేసిందని తెలిపారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి జిల్లాలో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులతో ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఒగ్గు డోలు కళాకారుల ఆటాపా టలతో ముందుకు సాగగా, జూనియర్ కళాశాల వరకు సాగింది. దేశభక్తి నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ముందుకు సాగారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు పాల్గొని పటేల్ దేశానికి చేసిన సేవలపై వివరించారు. మైభారత్ ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, మేరా యువ భారత్ జిల్లా యూత్ ఆఫీసర్ వెంకటరాంబాబు, అధికారి రహీం దర్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగాం కోఆర్డినేటర్ మనోహర్, ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డీవైఎస్ఓ సురేష్, కళాశాలల అధ్యాపకులు, అధికారులు, పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి లక్షన్నర విరాళం

ముత్తారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ సోదరుడు ఎన్ఆర్ఐ సమ్మయ్య శ్రీదేవి దంపతులు గ్రామంలో నిర్మిస్తున్న కోదండ రామాలయం, అయ్యప్ప స్వామి ఆలయాలకు రూ.1.50 లక్షల విరాళాన్ని అందించారు. శనివారం ఆలయ కమిటీకి విరాళాన్ని అందించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ ఐక్యవేదిక నాయకుల పూజలు



విగ్రహాన్ని దర్శించుకున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

జ్యోతినగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్‌టీపీసీ సోలార్ ప్లాంట్ తవ్వకాల్లో బయటపడిన పురాతన అమ్మవారి విగ్రహాన్ని నర్రాలపల్లిలో ప్రతిష్ఠించారు. అమ్మవారి విగ్రహాన్ని శనివారం పలువురు హిందూ ఐక్యవేదిక నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు దర్శించుకుని, పూజలు చేశారు. వారు మాట్లాడుతూ అమ్మవారికి శాశ్వతంగా స్థలాన్ని కేటాయించాలని, ఆలయ నిర్మాణానికి ఎన్‌టీపీసీ యాజమాన్యం ముందుకు రావాలని కోరారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు రావికంటి వర ప్రసాద్, రాకేష్, కుమార్, కంతాల సంతోష్ రెడ్డి, బుర్ర శంకర్ గౌడ్, వెంకటేష్, ప్రవీణ్, సాయి, హర్ష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ లోక్ అదాలత్‌లో 1349 కేసులు రాజీ

పెద్దపల్లిటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సునీత కుంచాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పన్ ఆదేశాల మేరకు జిల్లాలోని న్యాయస్థానాలలో శనివారం స్పెష ల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 1349లో కేసులు పరిష్కరించారు. మోటార్ వాహన చట్టం బాధితులకు రూ.24 లక్షల పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. 446 కేసులు పెద్దపల్లి, 171 కేసులు సుల్తానాబాద్, ఓదెల కోర్టు 205 కేసులు, మంథని కోర్టుకు, 527 కేసులు గోదావరిఖని కోర్టుకు సంబం ధించినవి ఉన్నాయని జడ్జి తెలిపారు.

డ్రగ్స్ నష్టాల పై ప్రచారం కల్పించాలి

పెద్దపల్లి టౌన్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై జిల్లాలో విస్తృతంగా ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డిపిఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం పై చర్చించారు. ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో చదివే పిల్లలకు, ఇంటర్ పిల్లలకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాల పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సచిదేవా పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన ప్రయోగ నమూనాలను పరిశీలిస్తున్న ఈడీ

జ్యోతినగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచిదేవ పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పలువురు రూపొందించిన సైన్స్ పర్యావరణం, వ్యవసాయం ప్రయోగ నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. వీటిని ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత తిలకించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమునాలను పరిశీలించి అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్ర, పరిశోధనా రంగంలో ఉన్న ఆసక్తి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా వెలుగులోకి వస్తాయని తెలిపారు. ఎన్టీపీసీ హెచ్ఆర్ జీఎం విజయ్ కుమార్ సింగర్, మానవ వనరుల విభాగం అధికారులు ప్రవీణ్ చౌదరి, ఆశిష్, శ్రీనివాస్, సచ్‌దేవా పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

లొంగుబాటులో అప్పాసి నారాయణ

కోల్‌సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రామగుండానికి చెందిన మావోయిస్టు నాయకుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేష్ అలియాస్ శంకర్(65) లొంగుబాటులో ఉన్నట్టు సమాచారం. సోమవారం డీజీపీ ఎదుట లొంగిపోనున్నట్టు తెలుస్తుంది. పాత రామగుండం గ్రామానికి చెందిన నారాయణ సింగరేణిలో పని చేసేవాడు. అతని భార్య రాధ, కూతురు ఉన్నది. గోదావరిఖని సీతానగర్‌లో నివాసముండేవారు. సికాస సాను భూతిపరుడిగా ఉంటూ 1995లో అజ్ఞాతంలోకి వెళ్లిపో యాడు. సికాస నాయకుడు బండి ప్రకాష్‌తో సాన్నిహి త్యంతో సికాసలో పని చేశాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పని చేసిన ఆయన దండకారణ్యంలో పని చేశా డు. ప్రస్తుతం జిల్లా కమిటీ సభ్యుడిగా కొనసా గుతున్నట్టు తెలుస్తుంది. ఆయనపై రూ.5లక్షల రివార్డు ఉంది. మావోయిస్టు నాయకుడు ఆజాద్‌తో ఇతను కూడా లొంగిపోతున్నట్టు సమాచారం.

చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ పోస్టర్‌ను శనివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఇఫ్టూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 19న హైద్రాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభను విజయవంత ం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ నాయకులు బీ అశోక్ పిలుపునిచ్చారు. గట్టయ్య, రాజేశ్వరి, మదునమ్మ, శారద, పోచం, రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నిలిచిన మధ్యాహ్న భోజనం



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ముత్తారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోయింది. మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలోకి దిగారు. దీంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నారు. అయితే దూరం నుంచి వచ్చే విద్యార్థులు తల్లితండ్రులు సకాలంలో పిల్లలకు భోజనం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం అందించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

స్పందన స్కూల్‌లో ఘనంగా బాలోత్సవ్



బహుమతులు అందుకొన్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాఠశాలల బాలోత్సవ్ శనివారం స్పందన మోడల్ స్కూల్‌లో ప్రారంభమైంది. మొదటి రోజు విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, క్లాసిక్ డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్ పోటీలు జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 12 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సెస్టో బాల్ సౌత్‌జోన్ చైర్మన్ జక్కుల దామోదర్‌రావు, వైకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కండెం సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రజాపాలనకు ప్రజల ఆమోదం

ఎలిగేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనకు ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ప్రజలు ఆమోదం తెలిపారని మాజీ వైస్ఎంపీపీ బుర్ర వీరస్వామి అన్నారు. ఎలిగేడులో శనివారం విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పని చేస్తూ, ఆదరాభిమానాలను చూరగొంటుందని తెలిపారు. కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో గెలుపు కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. కవ్వంపల్లి చంద్రయ్య, తాటిపల్లి సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వాస్తు పండితుడు కృష్ణారావుకు అవార్డు



కృష్ణారావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సుల్తానాబాద్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాట్నపల్లి గ్రామానికి చెందిన వాస్తు పండితుడు టీవీ కృష్ణారావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను 90 శాతం వికలాంగుడినని, ఒకరి సహాయం లేనిదే నడవడం, నిల్చోవడం, కూర్చోలేనని, అయినా వాస్తు విద్యతో ఇంటి ప్లాన్లు ఇస్తున్నానన్నారు.

వెనుకబడిన కులాల కోసం మరో వర్గీకరణ చేయాలి

మంథని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 113 కులాలుగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రవేశ పెడుతున్నప్పటికీ బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాల కోసం మరో వర్గీకరణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రిజర్వేషన్ల ద్వారా బీసీ వర్గాల్లో ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన కొన్ని కులాలే ఎక్కువ లబ్ధి పొందుతున్నారన్నారు. బీసీల్లోని ఏబీసీడీ గ్రూపులను తిరిగి వర్గీకరణ చేసి ఎలాంటి రిజర్వేషన్లు పొందని వారికి రిజర్వేషన్లు అందేలా ప్రత్యేక గ్రూపులో చేర్చాలని కోరారు.



ఓసీపీ-3 గైర్హాజరీ ఉద్యోగులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు అధికారులు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం 2025 అక్టోబరు నాటికి 150 మస్టర్ల కంటే తక్కువ హాజరు ఉన్న ఉద్యోగులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. గైర్హాజరీతో వేతనం నష్టపోవడమే గాక, గని ఉత్పత్తి లక్ష్యానికి ఆటంకం ఏర్పడుతుందని తె లిపారు. గైర్హాజరీకి గల కారణాలను తెలుసుకుని సలహాలు, సూచనలు చేశారు. వెల్ఫేర్ ఆఫీసర్లు సాయికృష్ణ, అజీజ్, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ రాజారత్నం, ఓఎస్ రమేష్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పీవోకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా పని చేస్తున్న జింగిటి రాజశేఖర్ బదిలీపై వెళ్తున్నందున శనివారం ప్రాజెక్టులో ఆయనకు కార్మిక సంఘాల నాయకులు ఆత్మీయ సన్మానించారు. మేనేజర్ పాపయ్య, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు గడ్డం తిరుపతి, తిరుపతిరావు, వెంకటస్వామి, వెల్ఫేర్ ఆఫీసర్ సాయి స్వరూప్‌తోపాటు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. బేస్ వర్క్‌షాప్‌లలో ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రెటరీ సదానందం ఆధ్వర్యంలో పీఓ రాజశేఖర్‌ను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, నాయకులు జక్కుల దామోదర్‌రావు, కిషన్‌రెడ్డి, శ్రీనివాసరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధన కోసం పట్టుదలతో ముందుకు సాగాలని జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్ అన్నారు. సుల్తానాబాద్‌లో ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శనివారం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ప్రారంభించారు. పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలల నుంచి వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, లక్ష్యం దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం జిల్లా స్థాయిలో గెలుపొంది, రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు మెడల్స్ అందించారు. పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, టేబుల్ టెన్నిస్ జిల్లా కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, కోశాధికారి గోపికృష్ణ, ప్రణయ్, తిరుపతి, పీఈటీలు ఆసియా, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు

ఓదెల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భ్రమరాంభ మల్లికార్జున స్వామి క్షేత్రంలో శనివారం సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను వైభవంగా నిర్వహించారు. పెద్దపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల నుంచి వందకుపైగా దంపతులు పాల్గొని వ్రతాలు చేశారు. ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, ఆరుట్ల శ్రీనివాసచార్యులు, ఆరుట్ల నరసింహచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సోషల్ జస్టిస్ ఫర్ రన్

రామగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదివారం సెంటినరీకాలనీ రాణి రుద్రమాదేవి క్రీడా ప్రాంగణం నుంచి పన్నూర్ సెంటర్ వరకు రన్‌ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేశిరవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ నాయకులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నూతన సిలబస్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నూతన సిలబస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. విద్యార్థులను ఉద్దేశించి పెద్దపల్లి డిగ్రీ కాలేజీ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డా. మారుతి మాట్లాడారు. విద్యార్థులు ఆంగ్ల సాహిత్యాన్ని సులభతరంగా ఎలా అధ్యయనం చేయాలని, అధ్యయనం చేయడం ద్వారా రచయిత భావాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే అంశాన్ని వివరించారు. కొత్త సిలబస్‌ను చూసి ఆందోళన చెందకుండా క్షుణ్ణంగా చదివి మార్కులు సాధించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, ఇంగ్లీష్ హెచ్ఓడీ సుబ్బారావు బృందం పాల్గొన్నది.

జాతీయ స్థాయి పోటీలకు చీఫ్ జడ్జిలుగా ముత్తారం వాసులు

ముత్తారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి స్టేడియంలో ఎస్ఎస్ఎన్ జాతీయ స్థాయి కరాటే పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు 16రాష్ట్రాల్లోని క్రీడాకారులు పాల్గొంటుండగా మండల కేంద్రానికి చెందిన మల్యాల శ్రీవిరాజ్, మల్యాల భరత్‌రాజ్‌లు చీఫ్ జడ్జిలుగా వ్యవహరిస్తున్నారు. సుమారు 1800 మంది క్రీడాకారులు పాల్గొంటున్న పోటీలకు రాష్ట్రం నుంచి జడ్జిగా బాధ్యతలను నిర్వహిస్తున్న వీరిని రాష్ట్ర స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రామస్వామి, అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అభినందించారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయంపై సంబరాలు

ఓదెల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంపై శనివారం సంబరాలు నిర్వహించారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్, ఐలయ్య, జంగ అజయ్, గోపు కుమార్ రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

రేపు జిల్లాలో పర్యటించనున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

కళ్యాణ్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ సోమవారం రామగుండం, మంథని పట్టణాల్లో పర్యటించనున్నట్టు టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండంలోని ఎస్సీ గురుకుల బాలికల హాస్టల్, మంథనిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను వారు సందర్శించనున్నారు. అదే విధంగా ఆయా పరిశ్రమల్లో ఎస్సీ, ఎస్టీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉంటే చైర్మన్, సభ్యుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

బ్రిడ్జి మధ్యలో ఇరుక్కుపోయిన వాహనాలు



కొత్తపల్లి బ్రిడ్జిపై దిగబడిన వాహనాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దబొంకూర్- కొత్తపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా ఇరువైపులా మట్టి పోయలేదు. దీంతో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ శనివారం దిగబ డింది. అటుగా వస్తున్న హార్వెస్టర్ సైతం ఇరుక్కుపోగా పలు గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సుమారు కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిచిపోగా స్థానికులు చర్యలు చేపట్టారు.